అమరజీవి త్యాగం మరువలేనిది

● జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి



పొట్టి శ్రీరాములు చిత్రపటం ముందు నివాళులర్పిస్తున్న జెడ్పీ సీఈఓ, ఉద్యోగులు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు కమాండెంట్ మహబూబ్ బాషా

కర్నూలు(అర్బన్): ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన ప్రాణ త్యాగాన్ని ఎవరు మరచిపోరని జిల్లా పరిషత్ సీఈఓ జి. నాసరరెడ్డి అన్నారు. ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవంలో భాగంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్‌లో పొట్టి శ్రీరాములు చిత్ర పటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ తెలుగు మాట్లాడే వారందరూ ఒకే రాష్ట్రంగా ఉండాలని పొట్టి శ్రీరాములు 58 రోజులు ఆమరణ నిరాహార దీక్ష చేసి ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించారన్నారు. ఆయన పట్టుదల, అకుంఠిత దీక్షను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి ఉద్యోగి తమ విధి నిర్వహణలో క్రమ శిక్షణగా మెలగాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ పర్యవేక్షకులు సరస్వతి, జితేంద్ర, నాగరాజు, పుల్లయ్యతో పాటు ఉద్యోగులు పాల్గొన్నారు.

● **కర్నూలు (టౌన్) :** ప్రత్యేక రాష్ట్ర సాధనలో పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం ఎనలేనిదని ఏపీ ఎస్పీ రెండో పటాలపు ఇన్‌చార్జ్ అదనపు కమాండెంట్ మహబూబ్ బాషా అన్నారు. శుక్రవారం ఆంధ్ర రాష్ట్ర అవతరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పటాలం క్వార్టర్స్‌లో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పటాలపు అసిస్టెంట్ కమాండెంట్ సుధాకర్‌రెడ్డి, షర్ఫుద్దీన్, వెంకటరమణ, పటాలపు రిజర్వు ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

● **కర్నూలు (సెంట్రల్) :** మాధవీ నగర్, రెవెన్యూ కాలనీల్లో ఉన్న రవీంద్ర విద్యాసంస్థల్లో రాష్ట్ర అవతరణ వేడుకలను కరస్పాండెంట్ పీబీవీ సుబ్బయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా పొట్టి శ్రీరాములు చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సేవలను కరస్పాండెంట్ పీబీవీ సుబ్బయ్య విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శారదా దేవి, కోఆర్డినేటర్లు అక్తర్ బేగం, సుభద్ర, బాలు, నాగేంద్ర పాల్గొన్నారు.

● **కర్నూలు కల్చరల్:** బీక్యాంప్ ఒకేషనల్ జూనియర్ కళాశాలలో శుక్రవారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవాన్ని ఘనంగ నిర్వహించారు. కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డి.మల్లికార్జున రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు రామకృష్ణ, విజయశేఖర్, సోమేష్, లక్ష్మి, ఉల్గోజి రావు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రేపు గుండెజబ్బులపై అవగాహన సదస్సు

కర్నూలు(హాస్పిటల్): 'వ్యాయామం-గుండె' అనే అంశంపై ఈ నెల 3వ తేదీన ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు కర్నూలు హార్ట్ ఫౌండేషన్ కార్యదర్శి డాక్టర్ పి. చంద్రశేఖర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 6 గంటలకు స్థానిక ఎ.క్యాంపులోని కర్నూలు హెల్త్‌క్లబ్‌లో ప్రారంభమయ్యే ఈ సదస్సులో ప్రముఖ కార్డియాలజిస్టు డాక్టర్ ఎ. వసంతకుమార్ హాజరై ప్రసంగిస్తారన్నారు.

ఆర్‌యూ సెక్యూరిటీ ఏజెన్సీని తొలగించాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయం సెక్యూరిటీ ఏజెన్సీని తొలగించాలని ఎస్ఎఫ్ఐ ఆర్‌యూ కార్యదర్శి రామకృష్ణ డిమాండ్ చేశారు. శుక్రవారం వర్సిటీలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్సిటీ భద్రతకు ఏర్పాటు చేసుకున్న సెక్యూరిటీ ఏజెన్సీ టెండర్ కాల పరిమితి ఆగస్టు 31వ తేదీతో ముగిసిందని అయినా అక్రమంగా అదే ఏజెన్సీని కొనసాగిస్తున్నారన్నారు. నూతనంగా టెండర్లు పిలిచి అర్ధాంతరంగా వాటిని రద్దు చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. సమావేశంలో నాయకులు మౌలాలి, సందీప్, రాజు, రమేష్, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

డీవైఎఫ్ఐ పతాకం ఆవిష్కరణ

కర్నూలు(సెంట్రల్) : డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం సుందరయ్య సర్కిల్‌లో ఆ సంఘం నాయకులు ఘనంగా నిర్వహించారు. సంఘం జిల్లా కార్యదర్శి వై.నగేష్ డీవైఎఫ్ఐ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రజా సమస్యలపై భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్, అజాద్ స్ఫూర్తితో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలను చూపడంలేదన్నారు. కార్యక్రమంలో శిరీష, విక్రమ్, ఇమ్రాన్, రాఖీ, మల్లేష్, సర్పరాజ్, శివకృష్ణ, మౌలాలీ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో సామూహిక కేదారేశ్వర వ్రతం

కర్నూలు కల్చరల్: ఓల్డ్‌సిటీలోని లలితా పీఠంలో అమావాస్యను పురస్కరించుకొని శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక అలంకారం చేసి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీ కేదారేశ్వర స్వామి వ్రతాన్ని సామూహికంగా నిర్వహించారు. పండితులు మామిళ్లపల్లి రాజేష్ శర్మ ఆధ్వర్యంలో వ్రతాన్ని ఆచరించారు. లలితా పీఠం పీఠాధిపతి మేడా సుబ్రహ్మణ్యం స్వామి సందేశమిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

'నాతో స్నేహం చెయ్యవూ' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ప్రముఖ రచయిత డాక్టర్ స్వరూప్ సిన్హా రచించిన 'నాతో స్నేహం చెయ్యవూ' పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం రాజస్తాన్ కోట వారి శాఖ మోషన్ జూనియర్ కళాశాలలో జరిగింది. ఉస్మానియా కళాశాల తెలుగు శాఖ అధ్యక్షులు డాక్టర్ మండి అన్వర్ హుసేన్ పుస్తకాన్ని ఆవిష్కరించి ప్రసంగించారు. కార్యక్రమంలో రచయిత జంధ్యాల రఘుబాబు, తెలుగు పండితులు ప్రతాపరెడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ అంజద్‌బాషా, అధ్యాపకులు లక్ష్మీనారాయణ, రాకీ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

విజేతకు సత్కారం



కాంస్య పతక విజేతను సత్కరిస్తున్న కమిషనర్

కర్నూలు (టౌన్): గత నెల 17 నుంచి 19వ తేదీ వరకు గుంటూరులోని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 35వ సౌత్ జోన్ జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో కర్నూలు అథ్లెట్ హేమంత్ కాంస్య పతకం సాధించారు. సౌత్ జోన్ స్థాయిలో పతకం సాధించిన క్రీడాకారుడిని శుక్రవారం సాయంత్రం నగరపాలక సంస్థ కమిషనర్ సొంగా రవీంద్ర బాబు తన చాంబర్‌లో శాలువ కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఇటీవల కర్నూలు కేంద్రంగా ఎంతోమంది క్రీడాకారులు రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి, సౌత్‌జోన్ స్థాయిల్లో ప్రతిభ చాటి పేరు తీసుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు కార్యక్రమంలో జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతి రావు, అథ్లెటిక్స్ కోచ్ కాశీరావు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

హరికృష్ణకు డాక్టరేట్

కర్నూలు కల్చరల్: నగరానికి చెందిన ఎం.హరికృష్ణకు డాక్టరేట్ ప్రదానం చేశారు. అనంతపురం ఆర్ట్స్ కళాశాలలో గణిత విభాగంలో పనిచేస్తున్న అధ్యాపకులు డాక్టర్ జి.ప్రభాకర్ రావు పర్యవేక్షణలో ఫ్లూయిడ్ డైనమిక్స్‌లో ×ఆస్టడీ ఎంహెచ్‌డీ కన్వెక్టివ్ ఫ్లో త్రూ ప్లానర్ ఛానల్స్ె అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను పీహెచ్‌డీ అవార్డు ప్రదానం చేసినట్లు హరికృష్ణ పేర్కొన్నారు. పరిశోధన గ్రంథాన్ని శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీకి సమర్పించినట్లు తెలిపారు. కర్నూలులోని డాక్టర్ కేవీ సుబ్బారెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో గణితంలో ఈయన అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఈ సందర్భంగా కళాశాల యాజమాన్యం, సహ ఉద్యోగులు అభినందనలు తెలిపారు.

లోయలో పడి బాలుడి దుర్మరణం

కడప అర్బన్: సెల్ఫీ తీసుకుంటూ లోయలో పడి ఓ బాలుడు మృత్యువాత పడ్డాడు. దీపావళి పండుగ రోజున కడపలోని మృత్యుంజయకుంటకు చెందిన వీర వెంకటసాయి మనోజ్ (14) తన స్నేహితులతో కలిసి నగర శివార్లలోని పాలకొండలకు వెళ్లి సరదాగా ఈత కొట్టాడు. కొండపై నుంచి 60 అడుగుల కంటే ఎక్కువ వున్న లోయలో నీళ్లు పడుతున్నాయి. అక్కడ సెల్ఫీ తీసుకుంటున్న మనోజ్ కాలుజారి లోయలో పడిపోయాడు. సమాచారం తెలుసుకున్న రిమ్స్ పీఎస్ ఎస్ఐ జయరాములు, కడప ఫైర్ స్టేషన్ అధికారి బసివిరెడ్డి సంఘటన స్థలానికి చేరుకున్నారు. నీటి కుంటలో చిక్కుకుపోయిన మనోజ్‌ను బయటకు తీశారు. అప్పటికే మనోజ్ మృత్యువాత పడ్డాడు. ఈ సంఘటనతో కుటుంబంలో తీరని విషాదం నెలకొంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ జయరాములు తెలియజేశారు. కర్నూలు జిల్లా పత్తికొండ నుంచి కొన్ని సంవత్సరాల క్రితం బేల్దారి పని కోసం వచ్చి కడపలోని మృత్యుంజయకుంటలోనే మనోజ్ తల్లిదండ్రులు విజయ్, వెంకటలక్ష్మిలు స్థిరపడ్డారు. ఈనెల 4వ తేదీనే పుట్టినరోజు కావడంతో పుట్టిన రోజుకు కూడా కొత్త దుస్తులను కొని తెచ్చారు. ఇంతలోనే ఈ సంఘటన చోటుచేసుకుంది.

పటేల్ సంకల్పాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి

కర్నూలు(సెంట్రల్): దేశ సమగ్ర, ఐక్యత కోసం కృషి చేసిన సర్దార్ వల్లభాయ్ పటేల్ సంకల్పాన్ని యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయశ్రీ సూచించారు. గురువారం ఉదయం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతిని పురస్కరించుకొని ఏక్తా దివాస్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా పటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ..భిన్న సంస్కృతులు, జాతులు ఉన్న దేశాన్ని ఏకీకరణ చేసిన సర్దార్ కృషిని కొనియాడుతూ ఏక్తా దివాస్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి భాస్కర్, మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్ సబీహాసుల్తానా, డీఆర్‌డీఏ ఏపీడీ శ్రీధర్ పాల్గొన్నారు.



పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న అధికారులు

దేశ ఐక్యతను కాపాడుకోవాలి

కర్నూలు కల్చరల్: భారతదేశ ఐకమత్యాన్ని, సమగ్రతను కాపాడటానికి ప్రతి ఒక్కరూ కంకణ బద్ధులు కావాలని రాయలసీమ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య ఎన్‌టీకే నాయక్ పిలుపునిచ్చారు. ఉక్కు మనిషిగా కీర్తి గడించిన పటేల్ జయంతిని పురస్కరించుకుని యూనివర్సిటీ సెనేట్ హాలులో జరిగిన కార్యక్రమంలో పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పటేల్ స్ఫూర్తిని కొనసాగించాల్సిన అవసరాన్ని యువతరం ముఖ్యంగా విద్యార్థులు గ్రహించాల్సిన అవసరముందని పిలుపునిచ్చారు. జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ పి.నాగరాజు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ కె.వెంకటరత్నం, డాక్టర్ బి.విజయ్, డాక్టర్ నాగచంద్రుడుతో పాటు విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.



సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఆర్‌యూ వీసీ ఎన్‌టీకే నాయక్

చిరస్మరణీయురాలు ఇందిరా గాంధీ



ఇందిరా, పటేల్ చిత్ర పటాలకు పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్‌నాయకులు

కర్నూలు(సెంట్రల్) : దేశంలో 14 ప్రైవేట్ బ్యాంకులను జాతీయం చేసి పేద, మధ్యతరగతి ప్రజలకు రుణాలు ఇప్పించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన మాజీ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ చిరస్మరణీయురాలని డీసీసీ అధ్యక్షుడు పి.మురళి కొనియాడారు. అలాగే సర్దార్ వల్లాభాయ్ పటేల్ వీరోచిత పోరాటంతోనే తెలంగాణకు నిజాం రాజు నుంచి విముక్తి లభించిందని కీర్తించారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇందిరా గాంధీ వర్ధంతి, పటేల్ 149వ జయంతి కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఇద్దరి చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ ఎమ్మెల్సీ ఎం.సుధాకర బాబు, నాయకులు బతుకన్న, షేక్ రియాజుద్దీన్, స్యద నవీద్, కె.సత్యనారాయణగుప్తా, ప్రమీళ, వెంకటసుజాతా తదితరులు పాల్గొన్నారు.

భక్తులు నదీ తీర ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండాలి

కర్నూలు (టౌన్): కార్తీక మాసం స్నానమాచరించే భక్తులు నదీ తీర ప్రాంతాల వద్ద అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ బిందు మాధవ్ శుక్రవారం ఒక ప్రకటనలో హెచ్చరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు నదీ స్నానాలు ఆచరించేందుకు కార్తీక దీపాలు వదిలే వినాయక ఘాట్, ఓర్వకల్లు, కాల్వబుగ్గ రామేశ్వర శివాలయం, వెల్దుర్తిలోని బ్రహ్మగుండేశ్వర శివాలయం, నందవరం పీఎస్ పరిధిలోని గురజాల గ్రామ శివాలయం, తుంగభద్ర నదీ తీర ప్రాంతాల వద్ద భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని తెలిపారు. కర్నూలు పట్టణంలోని వినాయక ఘాట్‌లో కార్తీక దీపోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నదీ తీర ప్రాంతాల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి క్రీడల షెడ్యూల్ విడుదల

కర్నూలు (టౌన్) : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్రస్థాయి క్రీడా పోటీల షెడ్యూల్ విడుదలైంది. ఈ విషయాన్ని ఎస్‌జీఎఫ్ అండర్-14, అండర్-17 జిల్లా కార్యదర్శి ఎస్.గిడ్డయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు నెల్లూరు పట్టణంలో అండర్-17 విభాగంలో హాకీ, అలాగే 5 నుంచి 7వ తేదీ వరకు పల్నాడులో అండర్-14, 17 విభాగాల్లో స్విమ్మింగ్ పోటీలు, 6, 7 తేదీల్లో ఏల్లూరు జిల్లా ఉంగుటూరు పట్టణంలో అండర్-14 విభాగంలో అథ్లెటిక్స్ బాలబాలికల పోటీలు, 6,7 తేదీల్లో పులివెందుల పట్టణంలో అండర్-14, 17 సాఫ్ట్ టెన్నిస్, అలాగే అన్నమయ్య జిల్లా అనగల్లు పట్టణంలో అండర్-14 విభాగంలో బాలబాలికల బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు, 7 నుంచి 9వ తేదీ వరకు ఖో-ఖో పోటీలు, 9 నుంచి 11వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లా గాజువాకలో అండర్-14 నెట్ బాల్ బాలబాలికల పోటీలు, 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణంలో అండర్-17 నెట్‌బాల్ బాలబాలికల పోటీలు, అలాగే 9, 10 తేదీల్లో కడప జిల్లా కమలాపురం పట్టణంలో అండర్-14 విభాగంలో రగ్బీ బాలబాలికలు, 9 నుంచి 11వ తేదీ వరకు విజయ నగరం జిల్లా భోగాపురంలో అండర్-14 విభాగంలో బాలబాలికల వాలీ బాల్ పోటీలు, 8 నుంచి 10వ తేదీ వరకు నెల్లూరు జిల్లా ఆత్మకూరు పట్టణంలో అండర్-17 విభాగంలో బాలుర నెట్ బాల్ పోటీలు, అలాగే 9, 10వ తేదీల్లో తిరుపతి జిల్లా రేణిగుంట పట్టణంలో అండర్-17 బాలబాలికల గట్కా పోటీలు ఉంటాయని తెలిపారు.

ఘనంగా ఏఐటీయూసీ వ్యవస్థాపక దినోత్సవం

కర్నూలు(సెంట్రల్): దేశ స్వాతంత్ర్య కోసం పోరాడిన ఏకైక జాతీయ కార్మిక సంస్థ ఏఐటీయూసీ అని ఆ సంఘం జిల్లా కార్యదర్శి ఎస్.మునెప్ప అన్నారు. శుక్రవారం ఆ యూనియన్ 105 వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను సీపీఐ కార్యాలయంలో నిర్వహించారు. ముందుగా కార్మిక జెండాను ఆవిష్కరించి కార్మికులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ..1920 అక్టోబర్ 31వ తేదీన ముంబాయిలో ఏఐటీయూసీ ఆవిర్భావించిందన్నారు. కాగా, నగరంలో 25 చోట్లా ఏఐటీయూసీ ఆవిర్భావ ది వేడుకలను నిర్వహించి జెండాలను ఆవిష్కరించారు.నాయకులు జి.చంద్రశేఖర్, రామాంజనేయులు, కృష్ణారెడ్డి, గణేస్, రాము, డీ సీ రహమాన్ పాల్గొన్నారు.

పెద్దాసుపత్రిలో ..

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో గురువారం ఏఐటీయూసీసి 105వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ఏపీ మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు హాజరయ్యారు. వైద్య ఉద్యోగుల సమస్యలు న్యాయమైనవి ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానని ఆయన చెప్పారు. యూనియన్ అధ్యక్షులు బాలునాయక్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి మునెప్ప, యూనియన్ ట్రెజరర్ సురేష్, హరిచంద్రనాయుడు, నరసింహులు, ఉరుకుందయ్య, శౌరెడ్డి, సుందర్రాజు పాల్గొన్నారు.

ఈరోజు

మానసిక వికలాంగులకు ఉచిత వైద్యశిబిరం

కర్నూలు (లీగల్): రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు శనివారం ప్రకాష్ నగర్‌లోని అంబికా శిశు కేంద్రంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.లీలా వెంకటశేషాద్రి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

అయ్యప్ప భక్తులకు అన్నదానం

కర్నూలు కల్చరల్: కర్నూలు సప్తగిరి నగర్ మణికంఠ అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం నుంచి అన్నదాన వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు అయ్యప్ప స్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అయ్యప్ప స్వామి మాలధారణ భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని పేర్కొన్నారు.

కమిషనర్ సీరియస్

- వివిధ విభాగాల్లో 59 మందికి మెమోలు జారీ
- రెవెన్యూ ఆఫీసర్ నుంచి సూపరింటెండెంట్ల వరకు..

కర్నూలు (టౌన్) : ప్రతి ఒక్కరు పని వేళలు పాటించాలని నగరపాలక కమిషనర్ జారీ చేసిన ఆదేశాలను కొందరు బేఖాతరు చేస్తున్నారు. దీంతో ఆగ్రహించిన కమిషనర్ సొంగా రవీంద్రబాబు వివిధ విభాగాల్లో పనిచేస్తున్న 59 మంది ఉద్యోగులకు మెమోలు జారీ చేశారు. ఒక్కసారిగా ఈ స్థాయిలో ఉద్యోగులపై కమిషనర్ సీరియస్ కావడంపై నగరపాలకలో చర్చకు దారి తీసింది. ఈనెల 29 వ తేదీ నగర పాలక కమిషనర్ అక్కడే పనిచేసే ఉద్యోగి చేత మూవ్‌మెంట్ రిజిస్టర్ తెప్పించుకున్నాడు. అందులో మధ్యాహ్నం 2.45 నిముషాల నుంచి 3 గంటల 14 నిముషాల మధ్యలో ఉద్యోగులు కార్యాలయంలో అందుబాటులో లేరు. బయటకు వెళ్లినా... మధ్యాహ్నం వేళ లంచ్ బ్రేక్ సమయంలోనూ మూవ్ మెంట్ రిజిస్టర్‌లో ఆయా విభాగాలకు చెందిన ఉద్యోగులు తప్పనిసరిగా సంతకాలు చేయాలి. అయితే పలువురు ఈ నిబంధనను ఉల్లంఘించారంటూ కమిషనర్ సీరియస్ అయ్యారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించడం, వేళకు రాని 59 మంది ఉద్యోగులందరికీ మెమోలు జారీ చేశారు. రెండు రోజుల వ్యవధిలో వాటికి లిఖిత పూర్వక సమాధానం తెలియజేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు...

ఏవరెవరంటే...

ఏ.సెక్షన్ రెవెన్యూ విభాగంలో రెవెన్యూ ఆఫీసర్, సూపరింటెండెంట్, జూనియర్ అసిస్టెంట్లు (ఏ1, ఏ2, ఏ3, ఏ4, ఏ8, ఏ9, సీనియర్ అసిస్టెంట్ ఏ6, ఏ10 , టీసబ్ల్యూ, డీఈఓ బి. సెక్షన్‌లో అకౌంట్స్‌లో బి3, బి4, బి5, బి6 డీపీవో, సి. సెక్షన్ (మెయిన్‌లో ముగ్గురు సూపరింటెండెంట్లు, సీ1, సీ3, సీ5, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ డి- సెక్షన్‌లో జూనియర్ అసిస్టెంట్, రికార్డు అసిస్టెంట్, ఈ- సెక్షన్‌లో (ఇంజనీరింగ్ విభాగం)లో ఈ1, ఈ2, ఈ3 డీపీఓ, ఎఫ్. సెక్షన్‌లో ఎఫ్1, ఎఫ్2, ఎఫ్4, ఎఫ్ 5 టౌన్ ప్లానింగ్‌లో సూపరింటెండెంట్, జి1, జి2, జి3, జి4, డీఈవో తో పాటు హెచ్ సెక్షన్ యూపీఏలో టౌన్ ప్రాజెక్టు ఆఫీసర్, సూపరింటెండెంట్, వార్డు కార్యదర్శులు, డీపీఓలు ఉన్నారు.

సాల్ట్ లీడర్ షిప్ ట్రైనింగ్‌ను వాయిదా వేయాలి

కర్నూలు కల్చరల్: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 4వ తేదీ నుంచి నిర్వహిస్తున్న సాల్ట్ లీడర్ షిప్ ట్రైనింగ్‌ను వాయిదా వేయాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఎన్వీ కృష్ణారెడ్డి, ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో కోరారు. 4వ తేదీ నుంచి సెల్ఫ్ అసెస్మెంట్ షెడ్యూల్ ఉండటంతో పాటు ఎస్ఎస్‌సీ నామినల్ రోల్స్ పంపేందుకు ఈనెల 11 వ తేదీ ఆఖరు అని ఉందని పేర్కొన్నారు. ఇవన్నీ ఒకే సారి ఉండటంతో ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు.

రూ.10 నాణేలను వినియోగించవచ్చు

కర్నూలు(అగ్రికల్చర్): రూ.10 నాణేలను ప్రతి ఒక్కరు రోజువారి లావాదేవీలకు వినియోగించవచ్చని కలెక్టరేట్‌లోని ఎస్‌బీఐ ట్రెజరీ శాఖ చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం బ్రాంచీలో జరిగిన కార్యక్రమంలో రూ.10 నాణేలను పలువురు చిన్న వ్యాపారులకు అందజేశారు. ఈ సందర్భంగా చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్ మాట్లాడుతూ... ఈ నాణేలను అన్ని దుకాణాలు, బ్యాంకులు ఆమోదిస్తాయని పేర్కొన్నారు. వినియోగదారులు ఎలాంటి సంకోచం లేకుండా 10 నాణేలను వినియోగించవచ్చని తెలిపారు. ఎలాంటి అనుమానాలు ఉన్నా.. బ్యాంకులను సంప్రదించవచ్చని సూచించారు. కార్యక్రమంలో నగదు అధికారి రాజేంద్రప్రసాద్ కూడా పాల్గొన్నారు.



రూ.10 నాణేలను దుకాణదారులకు పంపిణీ చేస్తున్న ఎస్‌బీఐ ట్రెజరీ బ్రాంచీ చీఫ్ మేనేజర్ సీవీఆర్ ప్రసాద్

రోగులకు ఇబ్బందులు లేకుండా చూడండి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి చికిత్స కోసం వచ్చే పేద రోగులకు ఎలాంటి ఇబ్బందులూ రానివ్వద్దని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు ఆదేశించారు. శుక్రవారం ఆయన ఆసుపత్రిలోని సూపర్‌స్పెషాలిటీ విభాగాలైన న్యూరోసర్జరీ, యురాలజీ, కార్డియాలజీ, నెఫ్రాలజీ, క్యాజువాలిటీ, ఎంసీహెచ్, గైనిక్, న్యూరాలజీ, ఎండోక్రైనాలజీ, జనరల్ సర్జరీ, మెడికల్, ఆర్థోపెడిక్, ఈఎన్‌టీ, డెర్మటాలజీ, డైట్, పలు ఓపీ విభాగాలను సందర్శించి పరిశీలించారు. న్యూరోసర్జరీ విభాగంలోని ఆపరేషన్ థియేటర్‌లో ఏసీలు పనిచేయకపోవడం గురించి ఆరా తీశారు. ఈ ఏసీలు వెంటనే మరమ్మతులకై యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్నారు. ఆసుపత్రిలో సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బంది, స్టాఫ్‌నర్సులు, ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌వోల ప్రతి నెలా వారు ఏ విభాగాల్లో పనిచేస్తున్నారు, వారి డ్యూటీ రోస్టర్ ప్రతి నెలా తనకు అందించాలని చెప్పారు. వైద్యులు, సిబ్బంది ప్రతి ఒక్కరూ ఆసుపత్రిలో డ్రెస్‌కోడ్ ధరించాలన్నారు. డైట్ విభాగాన్ని పరిశీలించి రోగులకు మెరుగైన భోజనం అందించాలని చెప్పారు. ఆయన వెంట సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, న్యూ డయాగ్నోస్టిక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సునీల్ ప్రశాంత్, ఏడీ రమేష్‌బాబు, నర్సింగ్ సూపరింటెండెంట్ సావిత్రిబాయి ఉన్నారు.



ఆసుపత్రిలోని డైట్ విభాగాన్ని పరిశీలిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె. వెంకటేశ్వర్లు

డాక్టర్ వెంకటేశ్వర్లుకు ఘనసన్మానం

సూపరింటెండెంట్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ కె. వెంకటేశ్వర్లును ఆర్థోపెడిక్ విభాగం వైద్యులు ఘనంగా సన్మానించారు. శుక్రవారం ఆసుపత్రిలోని ఆర్థోపెడిక్ విభాగంలో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.డాక్టర్ వెంకటేశ్వర్లు కేక్ కట్ చేయగా వైద్యులు అభినందనలు తెలిపారు. అనంతరం ఆర్థోపెడిక్ హెచ్ఓడీ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడారు.

దోమల పెరుగుదలను అరికట్టాలి



డ్రమ్ములో నీటిని పారబోయిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్. భాస్కర్

కర్నూలు(హాస్పిటల్): దోమల పెరుగుదలను అరికట్టాలని వైద్య సిబ్బందిని డీఎంహెచ్ఓ డాక్టర్ ఎల్. భాస్కర్ ఆదేశించారు. శుక్రవారం స్థానిక బండిమెట్ట యూపీహెచ్‌సీని తనిఖీ చేసి రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. అనంతరం అక్కడే జరుగుతున్న ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా ఆరోగ్య సిబ్బంది వారి పరిధిలోని వార్డులను సందర్శించి ప్రజలు వారానికి ఒకసారి నీటి నిల్వలు లేకుండా పూర్తిగా తొలగించి దోమలు పెరగకుండా అరికట్టే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇల్లు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. తద్వారా దోమల వల్ల వ్యాప్తి చెందే వ్యాధులు మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, బోధకాలు, మెదడువాపులను అరికట్టవచ్చన్నారు. ఆయన వెంట డీఎంవో నూకరాజు, యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ముషాహిద్ చౌదరి పాల్గొన్నారు.

● స్థానిక డాక్టర్స్ కాలనీ యూపీహెచ్‌సీ పరిధిలోని 56వ సచివాలయంలో డెమో శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రస్తుత కాలంలో వర్షాల వల్ల తాగునీరు కలుషితం కావడంతో వాంతులు, విరేచనాలు మొదలై అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందని ఆయన చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్టీసీలో రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలు

కర్నూలు కల్చరల్: జిల్లా ప్రజా రవాణా శాఖ ఆవరణలో శుక్రవారం రాష్ట్రీయ ఏక్తా దివస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణా శాఖ అధికారి శ్రీనివాసులు సిబ్బంది చేత రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ దేశానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. దేశం ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడటానికి అందరూ అంకితం కావాలన్నారు. తోటి భారతీయులలో ఈ సందేశాన్ని వ్యాప్తి చేయడానికి కృషి చేయాలని, దేశం యొక్క అంతర్గత భద్రతను నిర్ధారించడానికి అందరూ తమ వంతు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో ప్రజా రవాణా కార్యాలయ సిబ్బంది, కర్నూలు-1, కర్నూలు-2 డిపోల సిబ్బంది, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడల్లో ప్రతిభ చాటండి

కర్నూలు (టౌన్) : చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభ చాటాలని స్పోర్ట్స్ ప్రమోటర్, న్యాయవాది జి. శ్రీధర్ రెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి సీనియర్ పురుషుల షూటింగ్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం క్రీడల సాధనతో ఒత్తిడిని అధిగమించవచ్చన్నారు. పోటీల్లో విజేతల వివరాలను ఆంధ్రప్రదేశ్ షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు పరుశరాముడు వెల్లడించారు. బీఆర్ అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల (చిన్నటేకూరు) విజేతగా నిలిచారు. ఆదర్శ జూనియర్ కళాశాల (కర్నూలు, ద్వితీయ స్థానం), డాక్టర్. బి.ఆర్. అంబేడ్కర్ గురుకుల బాలుర విద్యాలయం (సి. బెళగల్) జట్లు నిలిచాయని వెల్లడించారు. కార్యక్రమంలో ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు ప్రభాకర్, చిన్నసుంకన్న, రాఘవేంద్ర, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



విజేతగా నిలిచిన అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర కళాశాల జట్టును అభినందిస్తున్న అతిథులు